క్లుప్తంగా

గృహ నిర్మాణాల కోసం లే అవుట్ చదును



కరపలోని మూడో నంబర్ లే అవుట్‌లో చదును చేస్తున్న పొక్లెయిన్

కరప : జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల కోసం స్థానిక సెంట్రల్ లేఅవుట్‌లో మూడో నంబర్ ప్రాంతంలో చదును చేసే పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. పెదకొత్తూరు గ్రామానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు కరప లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పట్టాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ పెదకొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, సర్పంచ్ చింతా నాగలక్ష్మి, వీఆర్వో పి.శ్రీనివాసశర్మ చొరవతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకువచ్చారు. పొక్లెయిన్‌తో లేఅవుట్‌లో చదును చేయించే పనులను బుజ్జి, శర్మ చేపట్టారు. తొలివిడతగా 30 మందికి హౌసింగ్ లోన్లు మంజూరయ్యాయని, వారి ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపనకు చర్యలు తీసుకుంటున్నట్టు బుజ్జి తెలిపారు.

26న అరుణాచలం బస్సు



అరుణాచలం బస్సు

కాకినాడ : అరుణాచలం గిరిప్రదక్షిణ చేసే భక్తుల కోసం ఈ నెల 26న సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు నడుపుతున్నట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరే ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం దర్శనానంతరం కంచి, శ్రీకాళహస్తి క్షేత్రాలు తిరిగి, 29న రాత్రికి కాకినాడ చేరుకుంటుందన్నారు. ఒక టికెట్‌కు రూ.3,100 ధర నిర్ణయించినట్టు చెప్పారు. ఇందుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ (9492833885), మార్కెటింగ్ ప్రతినిధి స్వామి (7382910869), బీవీఎస్ఎన్ రెడ్డి (7382910778)ని సంప్రదించాలని కోరారు.

సామాజిక దృక్పథంతో వైద్య సేవలందించా..



అధునాతన పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పండుల రవీంద్ర, కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్ : ప్రతి ఒక్కరూ వైద్యం కోసం ఆస్పత్రులు, వైద్యుల వద్దకు వెళ్లాల్సివస్తోందని, వైద్యాన్ని సామాజిక సేవా కోణంలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ పండుల రవీంద్ర, కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో శ్రీపీఠం సమీపంలో పిఠాపురం రోడ్డును ఆనుకుని నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ అండ్ డయాబెటిక్ కేర్ ఐశ్వర్యాంబిక సత్త్వ ఆస్పత్రిని బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడను హాస్పటల్స్ హబ్‌గా పిలుస్తున్నారని, ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు కార్పొరేట్ ఆస్పత్రులు, చిన్న ఆస్పత్రులు ఇక్కడ సామాన్యుల నుంచి మధ్యతరగతి వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయన్నారు. ధనార్జన కోసం కాకుండా సేవా భావంతో ఆస్పత్రుల నిర్వాహకులు పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యులు పులిది వల్లి, మోహనరావు పాల్గొన్నారు.

రూ.25 లక్షల అల్ట్రాసౌండ్ మెషీన్ విరాళం



అల్ట్రాసౌండ్ మెషీన్‌ను అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: పైడా వెంకట నారాయణ, సుశీల రాఘవ రత్నమ్మ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పైడా రామకృష్ణ చేతుల మీదుగా రూ.25 లక్షల విలువైన అల్ట్రాసౌండ్ మెషీన్‌ను ఎస్ఎఫ్ఏఎల్ రోడ్డులోని డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాదం బాలకృష్ణ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ, లాభాపేక్ష లేకుండా నడుపుతున్న తమ ల్యాబ్‌కు ఇంత భారీ విరాళం ఇవ్వడం పైడా ట్రస్ట్ దాతృత్వానికి నిదర్శనమని అన్నారు. పైడా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, ఈ అల్ట్రా సౌండ్ మెషీన్ ద్వారా అబ్డామిన్, డాప్లర్స్, 2డీ ఎకో తదితర స్కానింగ్‌లు అతి తక్కువ ధరకే చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో పైడా వెంకటేశ్వరరావు, పైడా వెంకట నారాయణ, పైడా శ్రీనివాస్, పైడా సోమేశ్వరరావు, పైడా పద్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో నత్తనడక

- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో అరట్లకట్ట రహదారికి రూ.18.50 కోట్లు మంజూరు
- అయినా కాంట్రాక్టర్ల జాప్యంతో ప్రజల ఇబ్బందులు



విస్తరణ కోసం తవ్వేసిన అరట్లకట్ట రోడ్డు



కొరిపల్లిలో అసంపూర్తిగా వదిలేసిన సీసీ డ్రెయిన్

కరప : రెండు మండలాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు కాంట్రాక్టర్ల జాప్యంతో రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. అసంపూర్తి పనులతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తికాని డ్రెయిన్ల గోతుల్లో పడి ఆయా గ్రామాల్లో మహిళలు, చిన్నారులు గాయాలపాలవుతున్నారు. దీంతో నిర్లక్ష్యంగా ఉన్న అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కరప, పెదపూడి మండలాలను అరట్లకట్ట రోడ్డు అనుసంధానంగా ఉంది. మండలంలోని కరప నుంచి అరట్లకట్ట, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల మీదుగా పెదపూడి మండలం కరకుదురుకు అనుసంధానమవుతోంది. ఆయా గ్రామాల ప్రజలు అరట్లకట్ట, కరకుదురు, ఇంద్రపాలెం మీదుగా కాకినాడ పట్టణానికి వెళ్లేందుకు దగ్గరదారిగా ఉంటుంది. అలాగే పెదపూడి, జి.మామిడాడ గ్రామాలకూ వెళుతుంటారు. పెదపూడి మండలం నుంచి కరపకు అరట్లకట్ట వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. సింగిల్ వేగా ఉండే అరట్లకట్ట రోడ్డు గోతులుపడి ధ్వంసమైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడేవారు. ఆయా గ్రామాల ప్రజల వినతిమేరకు 2021లో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండగా ఎమ్మెల్యే కన్నబాబు ఈ రహదారి ఆధునికీకరణకు రూ.18.50 కోట్లు మంజూరు చేశారు. 2021లో ఏప్రిల్ 25న కాకినాడ ఎంపీ వంగా గీతతో కలిసి రోడ్డు పనులకు కరపలో భూమిపూజ చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్డు, రోడ్డుకిరువైపులా సీసీ డ్రెయిన్లు, రహదారి మధ్యలో కల్వర్టులు, అరట్లకట్ట వద్ద వంతెన నిర్మించాల్సి ఉంది. అరట్లకట్ట రోడ్డు వెడల్పు చేసి, బీటీ రోడ్డు నిర్మించాలి. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ కోసం గోతులు తవ్వి వదిలేశారు. తర్వాత ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాలతో పనులు చేపట్టారు. కరప, కొరిపల్లి, గొడ్డటిపాలెం, జెడ్.భావారం గ్రామాల్లో సీసీ డ్రెయిన్లను ముక్కలుగా వేసి, అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండేళ్లు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పనుల జాప్యం వాస్తవమే.. : డీఈఈ

అసంపూర్తిగా వదిలేసిన అరట్లకట్ట రోడ్డు విస్తరణ, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులపై రోడ్లు, భవనాల శాఖ డీఈఈ బీవీఎస్ వర్మను వివరణ కోరగా, పనుల్లో జాప్యం జరగడం వాస్తవమేనన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డు వెడల్పు చేసేందుకు గోతుల తవ్వేసి వదిలేయడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. అసంపూర్తి పనులతో ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు.

– వాసంశెట్టి శ్రీనుబాబు, సర్పంచ్, గొడ్డటిపాలెం

చర్యలు తీసుకోవాలి



రోడ్డు ఆధునికీకరణ పనులు నిలిపివేయడం వల్ల రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులకు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయిన్లు ముక్కలుగా వేయడం వల్ల వీధుల్లోకి వచ్చిన చిన్న పిల్లలు, వృద్ధులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. అసంపూర్తి డ్రెయిన్ల పనులు పూర్తిచేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పలివెల నాగేశ్వరరావు, సర్పంచ్, కొరిపల్లి

త్వరలో కమాండ్ కంట్రోల్ సెంటర్ పునరుద్ధరణ

స్మార్ట్‌సిటీ ఎండీ నాగనరసింహారావు వెల్లడి



కాకినాడ : స్మార్ట్‌సిటీ పర్యవేక్షణలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన ఐసీసీసీని పునరుద్ధరించే అంశంపై బుధవారం సాయంత్రం తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.98 కోట్ల వ్యయంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ చేసేందుకు మూడు ఏజెన్సీలతో మాట్లాడామన్నారు. ఇందులో ఒక ఏజె ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బెంగళూరు, ఫరిదాబాద్, గురుగామ్ వంటి స్మార్ట్‌సిటీల్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లను కూడా ఓ సంస్థ సమర్థవంతంగా నిర్వహిస్తోందని, ఇక్కడ కూడా ఆ సంస్థకు అప్పగించే అంశంపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. స్మార్ట్‌సిటీ నిబంధనల మేరకు సంబంధిత సంస్థతో చర్చించాలని ఆయన అధికారులకు వివరించారు. సాధ్యమైనంత త్వరగా ఐసీసీసీ పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకట్రావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలి



ఫుట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు



దుర్గమ్మ గుడి వద్ద ఆర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలో అందుబాటులోకి వచ్చిన ఫుట్‌బాల్ కోర్టును విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని, రాణించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థి, దాత శ్రీనివాసులురెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ కోర్టును ఆయన బుధవారం ప్రారంభించి, దాతను అభినందించారు. గౌరవ అతిథి, ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, అవకాశాలను సద్వినియోగం చేసుకున్న వారే విజేతలుగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, పీడీలు డాక్టర్ వర్మ, రమణ పాల్గొన్నారు.

ఆర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ : కాకినాడ 9వ డివిజన్ దుర్గానగర్ దుర్గమ్మ గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చిని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, నాయకులు అనసూరి సుబ్బారావు బ్రదర్స్, బళ్ల సూరిబాబు, సీహెచ్ వెంకటరెడ్డి, కటారి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆలయ సందర్శన

కాకినాడ 38వ డివిజన్ సామర్లకోట రోడ్డులోని కనక దుర్గమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి బుధవారం సందర్శించారు. అమ్మవారికి పూజలు చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్‌కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను, డివిజన్ ఇన్‌చార్జి యార్లగడ్డ పద్మజ రాంబాబుచౌదరి పాల్గొన్నారు.

తడిచెత్త నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్

కాకినాడ: తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకు వస్తే ప్రభుత్వపరంగా తోడ్పాటు లభిస్తుందని నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. కేంద్రప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి, మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ అంశంపై కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత ఏజెన్సీలతో సమావేశమయ్యారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే సంస్థకు ప్రభుత్వపరంగా స్థలాన్ని సమకూర్చడంతో పాటు, స్వచ్ఛ భారత్ మిషన్ నుంచి ఆర్థిక తోడ్పాటు కూడా లభిస్తుందన్నారు. తడి చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా 2023–24లో దేశవ్యాప్తంగా సుమారు 500 ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ క్రమంలో ముందుకు వచ్చే సంస్థలకు అవసరమైన తడిచెత్తను నగరపాలక సంస్థ ద్వారా సమకూరుస్తామన్నారు. గో బర్ధన్ పేరిట జరిగే ఈ ప్లాంట్ ఏర్పాటులో పేడతో పాటు, ఎండిన ఆకులు, కూరగాయల, వ్యవసాయ వ్యర్థాలు, ఇతర తడిచెత్తను కార్పొరేషన్ నుంచి సమకూరుస్తామని వివరించారు. చమురు, సహజ వాయువులను ఉత్పత్తి చేసే సంస్థల ప్రతినిధులతో ముందుకు వస్తే ప్రభుత్వంతో చర్చించి అవసరమైన తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ మాధవి పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి నివారించండి

కాకినాడ సిటీ: జిల్లాలోని జగ్గంపేట, ప్రత్తిపాడు మండలాల్లోని మర్రిపాలెం, కాండ్రేగుల, గొల్లకుంట గ్రామాల్లో సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు ఆ పార్టీ జిల్లా నాయకులు చిలుకూరి రామకుమార్, దువ్వూరి సుబ్రహ్మణ్యం, ముసలిగంటి సురేష్ తదితరులు బుధవారం వినతిపత్రం అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు వరం



కొంగోడు సురక్ష వైద్య శిబిరంలో రోగులకు బ్యాగులను అందిస్తున్న నాయకులు, అధికారులు



గంగనాపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ వరమని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. కొంగోడు గ్రామంలో బుధవారం సర్పంచ్ నక్కా అప్పలస్వామి(బాబులు) అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని, అందుకు అవసరమైతే కార్పొరేట్ వైద్యం కూడా అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 376 మంది తమ పేర్లను నమోదు చేయించుకోగా, వేళంగి, కరప పీహెచ్‌సీ వైద్యులు ఈ.సింధూర, పి.ఆశ, ఆరోగ్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పోషకాహార స్టాళ్లను ఏర్పాటుచేశారు. గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. కేస్ షీట్, మందులతో కూడిన జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులను నాయకులు, అధికారులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంగనాపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కాకినాడ రూరల్: గంగనాపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. తూరంగి పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంతి, సిబ్బంది, స్పెషలిస్టు వైద్యులు గ్రామస్తులకు వైద్య సేవలందించారు. సర్వేలో కూపన్లు పొందిన వారు శిబిరంలో తమ పేర్లు నమోదు చేయించుకుని బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు మందులు, కేస్ షీట్లను పంపిణీ చేశారు. శిబిరాన్ని గ్రామ నాయకుడు గీసాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పరిశీలించారు.

లేపాక్షిలో బొమ్మల కొలువు

బోట్‌క్లబ్: నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న లేపాక్షి షోరూములో దసరా సందర్భంగా బొమ్మల కొలువుకు కావాల్సిన అన్ని బొమ్మలూ ఉన్నాయని మేనేజర్ వీరబాబు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకూ ఈ బొమ్మల కొలువు బొమ్మలు అందుబాటులో ఉంటాయన్నారు. కొండపల్లి బొమ్మలు, బంజారా, కోచెట్ లేస్, ఏటికొప్పాక బొమ్మలు, షరాన్‌వుడ్ కార్వింగ్, రోజ్‌వుడ్ కార్వింగ్, పేపర్ మెషీన్ ఐటమ్స్, బ్లాక్ మెటల్ ఐటమ్స్, లీఫ్ పెయింట్స్ వైట్ వుడ్ ఐటమ్స్, రుద్రాక్ష, స్ఫటిక తదితర అన్ని రకాల చేనేత వస్తువులూ ఇక్కడ ఉన్నాయని వివరించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ షోరూము తెరచి ఉంటుందన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

కాకినాడ: సైబర్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ నాగేశ్వరనాయక్ అన్నారు. వారధి కార్యక్రమంలో భాగంగా ఐడియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నార్కో డ్రగ్స్, సైబర్ క్రైమ్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. మొబైల్ మనీ యాప్స్, మొబైల్ క్యాష్ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అలరించిన కల్చరల్ ఫెస్ట్

కాకినాడ రూరల్: తిమ్మాపురం వద్ద ఉన్న అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో బుధవారం విద్యార్థినులు నిర్వహించిన ఎత్నిక్ కల్చరల్ ఫెస్ట్ అలరించింది. ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతిశ్రీ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. బొమ్మల కొలువు, రంగోలి, కోలాటం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, బతుకమ్మ, సంగీతం, ఎత్నిక్ ఫ్యాషన్ షోల ద్వారా విద్యార్థినులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎం.పోచయ్య, హారిక, రాధామాధవి, డాక్టర్ గోపి, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ అనిల్ అంబిక, డాక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

అమరుల కుటుంబ సభ్యులకు ఆహ్వానం

కాకినాడ రూరల్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఏపీఎస్పీ మూడో బెటాలియన్ సిబ్బంది కుటుంబ సభ్యులను ఈ నెల 21న జరగనున్న అమరవీరుల సంస్మరణ దినం (స్మృతి పరేడ్) కార్యక్రమానికి బెటాలియన్ అధికారులు ఆహ్వానించారు. బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు ఆదేశాల మేరకు అమరవీరుల కుటుంబ సభ్యులను బుధవారం అడిషనల్ కమాండెంట్, అడిషనల్ ఎస్పీ, అసిస్టెంట్ కమాండెంట్లు వారి నివాసాలకు వెళ్లి బెటాలియన్ ఆవరణలో జరగనున్న స్మృతి పరేడ్‌కు హాజరవ్వాలని కోరారు.

11 మందికి కారుణ్య నియామకాలు



ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణు

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ ఆధ్వర్యంలోని మండల పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన 11 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు చెందిన వారసులకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డిలు కారుణ్య నియామకాల కింద ఉద్యోగ ఉత్తర్వులు అందజేశారు. ముగ్గురికి కండిషనల్ పద్ధతిపై టైపిస్టు పోస్టులు, ఎనిమిది మందికి ఆఫీసు సబార్డినేట్ పోస్టుల్లో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఒక ఉద్యోగికి పదోన్నతి కల్పిస్తూ డ్రైవర్ పోస్టులో నియమించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పడిన రెండేళ్లలో 32 మందికి కారుణ్య నియామకాలు కింద జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఆఫీసు సబార్డినేట్ పోస్టుల్లో నియమిస్తూ ఉత్తర్వులు అందజేసినట్టు వివరించారు. ఖాళీల లభ్యతను బట్టి, త్వరితగతిన మిగిలిన వారికి కూడా అర్హతల మేరకు నియామకాలు చేస్తామన్నారు. మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులు మొత్తం 11 మందికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించటంపై ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, ఉద్యోగాలు పొందిన కుటుంబాల వారు హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్, సీఈవోలకు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిట



నడకుదురులో రూ.20 నోట్ల మాల అలంకరణలో దుర్గాదేవి



వీణాపాణిగా సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి అమ్మవారు



కరప శివాలయంలో వీణాపాణిగా పర్వతవర్ధినీదేవి



రాజరాజేశ్వరిగా దేవాలయం వీధి బాలాత్రిపురసుందరి అమ్మవారు

కరప : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో నాలుగో రోజు బుధవారం దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గాదేవిని మహాలక్ష్మి అవతారంగా అలంకరించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కరప, నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, కూరాడ, వాకాడ, వలసపాకల, అరట్లకట్ట, జెడ్.భావారం, కొరుపల్లి, వాకాడ తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజ చేయించుకున్నారు. అర్చకులు కొంపెల్ల చక్రధర్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ, మేడిశెట్టి పెద్దకాపు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కరపలోని విష్ణాలయంలో ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వతవర్ధినీదేవిని వీణాపాణి అవతారంగా అలంకరించి ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప మార్కెట్ యార్డు వద్ద విజయదుర్గా ఆటో యూనియన్, గ్రామస్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. నడకుదురు పంచాయతీ కార్యాలయం వద్ద దుర్గాదేవి అమ్మవారిని రూ.20 నోట్ల మాలతో అలంకరించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

బోట్‌క్లబ్: దసరా వేడుకల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి అమ్మవారు వీణాపాణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలాత్రిపుర సుందరి భజన మండలి ఆధ్వర్యంలో కీర్తనలు, సకలసిద్ధి నాట్యాలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన, మంజీర నాట్యాలయ విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం విశ్వనాథ రాజ్యలక్ష్మి బృందం భరతనాట్యం భక్తులను అలరించింది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వాడకట్టు కిషోర్, మేడపాటి నారాయణరెడ్డి, దంపతులు స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి నవవార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలోని ఉషా రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక రిజర్వు లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా బాలపూజలు నిర్వహించారు.

గాయత్రీదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

కాకినాడ రూరల్: శరన్నవరాత్రి నాలుగో రోజైన బుధవారం కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం మహిళలతో సామూహిక కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. కాకినాడ రూరల్‌లో దసరా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.